## న్యూ ఇయర్ వేడుకలు.. సిటీలో డ్రగ్స్ గిరాకీ

### మహారాష్ట్రకు చెందిన ముఠా అరెస్ట్



సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): న్యూ ఇయర్ వేడుకలకు హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేసేందుకు వచ్చిన మహారాష్ట్రకు చెందిన డ్రగ్ స్మగ్లింగ్ ముఠాను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం సెంట్రల్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శరత్ చంద్ర వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన అనూప్ నవనాత్ సోనవాలే అలియాస్ సుమిత్ పుణేలో మెకానిక్ ఇంజినీర్ చేసి, ఎండీఎంఏ డ్రగ్‌కు అలవాటు పడ్డాడు. 2020 నుంచి డ్రగ్ విక్రేతగా మారాడు. 2022లో హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) అతడిని అరెస్ట్ చేసింది. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత ముంబైలోని నాలసోప్రకు వెళ్లి ఆఫ్రికా దేశస్తుడైన జోయ్ వద్ద డ్రగ్స్ కొనుగోలుచేసి, దానిని పుణేలోని కిరణ్ గంగాధర్ బోమ్నలె అలియాస్ రాహుల్, వివేక్ రాజేశ్ వాఘమరె అలియాస్ విక్కీ, హైదరాబాద్‌లో రియాజ్, ఆరీఫ్‌లకు సరఫరా చేస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ గిరాకీ బాగుంటుందని సోనవానెకు సూచించారు. 150 గ్రాముల ఎండీఎంఏను జాయ్ వద్ద లక్ష రూపాయలకు కొనుగోలు చేశారు. దానిని తీసుకొని 27న హైదరాబాద్‌కు వచ్చి, సోమాజిగూడలోని మక్తా ప్రాంతానికి చేరుకున్నారు. తెచ్చిన డ్రగ్‌ను రియాజ్, ఆరీఫ్‌కు విక్రయించేందుకు ఎదురు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సెక్రటరియేట్ పోలీసులు కలిసి మహారాష్ట్రకు చెందిన అనూప్, కిరణ్, వివేక్‌ను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 102 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ విలువ రూ. 7.10 లక్షల ఉంటుందని డీసీపీ తెలిపారు.

## ఫోన్ నంబర్‌పై రూ.25 లక్షలు బహుమతంటూ..

బంజారాహిల్స్, డిసెంబర్ 28: ఫోన్ నంబర్‌పై రూ.25లక్షల బహుమతి వచ్చిందంటూ నమ్మించి యువతిని బురిడీ కొట్టించి డబ్బులు కాజేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని జహీరానగర్‌కు చెందిన ముబీనా ఉన్నీసాకు రెండురోజుల కిందట గుర్తుతెలియని ఓ వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. జియో నంబర్‌పై లక్కీ డ్రా కింద రూ.25లక్షలు బహుమతి వచ్చిందని, తాము చెప్పే కోడ్‌ను ఎస్‌బీహెచ్ బ్యాంకు మేనేజర్‌కు చెప్పాలని సూచించి, కోడ్‌తో పాటు అతడి మొబైల్ నంబర్‌ను కూడా పంపించాడు. అతడు పంపిన నంబర్‌కు ఫోన్‌చేయగా.. కోడ్ నంబర్‌తో పాటు ఇతర వివరాలన్నీ తీసుకున్నాడు. లక్కీ డ్రా వచ్చిన మాట నిజమేనని, దీన్ని పొందేందుకు రాజేశ్ యాదవ్ అనే వ్యక్తికి రూ.8,100 పంపించాల్సి ఉంటుందని సూచించాడు. బాధితురాలు డబ్బు పంపించింది. కొద్ది సేపటి తర్వాత బ్యాంక్ అకౌంట్‌లోకి డబ్బులు వచ్చినట్లు స్క్రీన్‌షాట్‌ను పంపించారు. తన అకౌంట్‌లోకి డబ్బులు రాలేదని బాధితురాలు కాల్ చేయగా.. పరిశీలిస్తున్నామని చెప్పారు. మరికొద్ది సేపటి తర్వాత డబ్బులు బ్లాక్ అయ్యాయి.. నగదు లిమిట్ పెంచాల్సి ఉన్నదని, పన్నులు చెల్లించాలంటూ రూ. 43 వేలు వసూలు చేశారు. ఆ తర్వాత రెండురోజులు గడిచినా తన అకౌంట్‌లోకి డబ్బులు రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## నిషేధిత మందులను విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

### బాడీ బిల్డింగ్, మత్తిచ్చే దగ్గు మందులు స్వాధీనం

సిటీబ్యూరో, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): శరీరం ఆకృతి (బాడీ బిల్డింగ్) త్వరగా పెరగడం, మత్తిచ్చే దగ్గు మందులను అక్రమ పద్ధతిలో విక్రయిస్తున్న ఓ వ్యక్తితో పాటు ఇద్దరు వినియోగదారులను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ శ్రీబాల కథనం ప్రకారం.. కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ అఫ్సర్ అహ్మద్ ఖాన్ గతంలో స్మార్ట్ లైఫ్ ఫార్మసీ పేరుతో రంగారెడ్డి జిల్లా కిస్మత్‌పేటలో మెడికల్ దుకాణాన్ని నిర్వహించి నష్టాలకు గురయ్యాడు. ఆ తరువాత మత్తు కోసం టాస్పెక్స్ సిరప్, శరీరం పెరిగేందుకు టెర్మిన్ ఇంజక్షన్‌ను ఉపయోగించాడు. ఈ క్రమంలోనే మాసబ్‌ట్యాంక్‌కు చెందిన మహ్మద్ అంజాద్, షేక్ దావూద్ అతడికి పరిచయమయ్యారు. ఈ రెండు నిషేధిత మందులను అలవాటు చేసుకున్నారు. ఆ తరువాత ఈజీగా డబ్బు సంపాదించాలని ప్లాన్ చేశారు. మహ్మద్ అఫ్సర్ తనకు తెలిసిన ఫార్మ వ్యాపారి నుంచి రూ. 314కు టెర్మిన్ ఇంజక్షన్ కొని.. దానిని అవసరమైన వారికి రూ. 600కు, టెస్పెక్స్ దగ్గు మందును రూ. 186కు ఒక బాటిల్ కొని.. దానిని రూ. 300 అవసరమైన వారికి నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషా బృందం గుడిమల్కాపూర్‌లో ఈ ముగ్గురు నిందితులను పట్టుకొని, వారి వద్ద నుంచి 667 ఇంజక్షన్లు, 300 దగ్గు టానిక్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ముగ్గురిని గుడిమల్కాపూర్ పోలీసులకు అప్పగించారు.

# ఒకేసారి ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఔట్

- థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్
- రియల్ వివాదంలో తలదూర్చిన మరో ఇన్‌స్పెక్టర్ కూడా
- చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు: పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి
- లిస్టులో మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు..?

సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ/శంషాబాద్ రూరల్, డిసెంబరు 28 (నమస్తే తెలంగాణ): చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు కేసుల దర్యాప్తులో ఏకపక్షంగా వ్యవహరించడమే కాకుండా.. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి సీరియస్ అయ్యారు. ఈ క్రమంలో కమిషనరేట్ పరిధిలోని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే... కేపీహెచ్‌బీ కాలనీ ప్రాంతానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ మొవ్వ ప్రవీణ్‌తో ఏపీకి చెందిన శ్రీలక్ష్మికి 2018లో వివాహమైంది. అయితే, కొన్ని రోజుల తర్వాత భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఇటీవల శ్రీలక్ష్మి కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులను ఆశ్రయించి, భర్త ప్రవీణ్ వద్ద తన చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉన్నాయని, వాటిని ఇప్పించాలని కోరుతూ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఈ నెల 23న ప్రవీణ్‌ను విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. విచారణ పేరుతో అతడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. దీంతో బాధితుడు తనపై పోలీసులు జరిపిన దాష్టికాన్ని సోషల్ మీడియా ద్వారా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి చేరవేశాడు. దీనిపై తీవ్రంగా స్పందించిన సీపీ అవినాశ్ మహంతి జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించారు. బాధితుడిపై ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ తీవ్రంగా దాడి చేసినట్లు అధికారుల విచారణలో తేలడంతో.. కేపీహెచ్‌బీ కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనలో యువకుడిని అసభ్య పదజాలంతో తిట్టి, తీవ్రంగా కొట్టి గాయపర్చిన ఎస్సై, కానిస్టేబుళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

### మరో కేసులో ఆర్‌జీఐ ఇన్‌స్పెక్టర్‌పై వేటు..



ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్



ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్

గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదంలో ఆర్‌జీఐఏ పోలీసు ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్ ఏకపక్షంగా వ్యవహరించడమే కాకుండా.. అమాయకులను జైలుకు పంపాడు. బాధితుల కథనం ప్రకారం.. గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలు రాజేంద్రనగర్, శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. లావాదేవీల్లో వీరి మధ్య వివాదం తలెత్తింది. వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన మహిళ.. రియల్ వ్యాపారం చేస్తున్న మహిళతో పాటు ఆమె భర్త తనను మోసం చేశారంటూ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పలు సెక్షన్ల కింద ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్ కేసులు నమోదు చేశాడు. ఫిర్యాదు చేసిన మహిళతో రాజీ కుదుర్చుకోవాలని రియల్ వ్యాపారం చేసే మహిళపై వత్తిడి తీసుకువచ్చాడు. దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో సదరు మహిళను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించాడు. అంతటితో ఆగకుండా అరెస్టు చేసిన మహిళ చేతికి బేడీలు వేసిన ఫొటోలను ఫిర్యాదు చేసిన మహిళకు పంపించాడు. సదరు మహిళ ఆ ఫొటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ రియల్ వ్యాపారి కుటుంబ పరువుకు భంగం కలిగించింది. ఏమాత్రం సంబంధం లేని ఆమె భర్త, కుమారుడు, ముంబైలో ఉంటున్న కూతురు పేర్లను సైతం ఆ కేసులో ఇరికించడమే కాకుండా భర్త, కుమారుడిని సైతం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించాడు. తన కుటుంబానికి జరిగిన అన్యాయంపై ఉద్యోగరీత్యా ముంబైలో ఉంటున్న యువతి రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు జరిపిన విచారణలో ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్ చట్టాన్ని చేతిలోకి తీసుకుని, ఏక పక్షంగా వ్యవహరించినట్లు నిర్ధారణ జరిగింది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం ఆదేశాలు జారీచేశారు.

### హిట్ లిస్ట్‌లో మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు..

విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్న మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై అంతర్గత విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఒక ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు రాజేంద్రనగర్ జోన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మరో ఇన్‌స్పెక్టర్ వ్యవహారంపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. విచారణ నివేదిక ఆధారంగా సదరు ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

### అతిక్రమిస్తే చర్యలు తప్పవు: సీపీ మహంతి



పోలీసు అధికారులు చట్టాన్ని న్యాయబద్ధంగా అమలు చేయాలి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే విరుద్ధంగా వ్యవహరిస్తే ఎలా..? చట్టం దృష్టిలో అందరూ సమానమే. ప్రజలు ఎంతో నమ్మకంతో న్యాయం జరుగుతుందని పోలీసుల వద్దకు వస్తారు. వారికి న్యాయం చేయాలి. మరి కొంత మంది తప్పుడు ఫిర్యాదులతో తమ ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేస్తారు. పోలీసులు ఇరువర్గాలకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు చేసి, చట్ట పరంగా ముందుకు వెళ్లాలి. వత్తిళకు లోనై లేదా డబ్బుకు ఆశపడి దర్యాప్తును ఏకపక్షంగా జరిపి అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు. చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించినా..! చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవు.

## లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులు ఇప్పిస్తామంటూ మోసం..

బంజారాహిల్స్, డిసెంబర్ 28: ఇన్సూరెన్స్ పాలసీ కాలపరిమితి ముగియడంతో బకాయిలు చెల్లిస్తే పాలసీ డబ్బులు వస్తాయంటూ నమ్మించి డబ్బులు దండుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 11 నివాసి, వ్యాపారి అశోక్ చంద్‌కు జూలైలో దీప్తి అగర్వాల్ పేరుతో ఓ యువతి ఫోన్ చేసింది. తాను ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి మాట్లాడుతున్నానని, అశోక్‌కు చెందిన ఒక ఇన్సూరెన్స్ పాలసీ పూర్తయిందని చెప్పింది. మెచ్యూరిటీ అయిన పాలసీ డబ్బులు రావాలంటే.. పెండింగ్‌లో ఉన్న రూ.4.5 లక్షల బకాయి చెల్లించాలని సూచించింది. పలుమార్లు ఆమె ఫోన్ చేయడంతో ఇటీవల రూ.4.5 లక్షలు ఆమె సూచించిన అకౌంట్‌కు పంపించాడు. దీనికి సంబంధించిన రశీదులను దీప్తి అగర్వాల్ పేరుతో మెయిల్ ద్వారా అశోక్ కుమార్‌కు పంపించారు. నవంబర్ నెలాఖరుకు పాలసీ డబ్బులు వస్తాయని ఎదురుచూసిన అశోక్ అగర్వాల్.. పలుమార్లు కాల్ చేసినా స్పందించకపోవడంతో తాను సైబర్ మోసానికి గురయ్యాయని గుర్తించారు. గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విద్యార్థిని ఆత్మహత్య

పీర్జాదిగూడ, డిసెంబర్ 28: ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి పట్టణానికి చెందిన బీరయ్య కూతురు వర్ష(16) పీర్జాదిగూడ పరిధిలోని ఓ జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్నానని.. కుటుంబ సభ్యులను మిస్ అవుతున్నానని మానసికంగా బాధపడుతూ గురువారం మధ్యాహ్నం హాస్టల్ బాత్‌రూంలోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కాలేజీ సిబ్బంది వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కళాశాల యాజమాన్యం చదువు పేరుతో చేసిన ఒత్తిడి భరించలేకనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు పలు విద్యా సంఘాలు ఆరోపించాయి.

## కొబ్బరి బోండాల చాటున ఎర్ర చందనం

### లారీ, ఎర్రచందనం స్వాధీనం.. ముగ్గురి అరెస్టు



పోలీసులు పట్టుకున్న ఎర్రచందనం దుంగలు

మేడ్చల్, డిసెంబర్ 28: కొబ్బరి బోండాల చాటున అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న లారీని మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఎర్రచందనం, లారీని స్వాధీనం చేసుకుని ముగ్గుర్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లారీ లో డ్రైవర్ సత్యబాబ్, ఎర్రచందనం వ్యాపారి ప్రతాప్, మరోవ్యక్తి హరిప్రకాశ్ కలిసి ఆంధ్రప్రదేశ్ నుంచి నాగపూర్‌కు ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా కొబ్బరి బోండాలు తీసుకెళ్తున్న లారీలో ఎర్రచందనం దుంగలపై పెట్టి తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు మేడ్చల్ పరిధిలోని ఓఆర్‌ఆర్ వద్ద లారీని పట్టుకుని తనిఖీలు నిర్వహించారు. ఎర్రచందనం దుంగలు లభ్యం కావడంతో డ్రైవర్‌తో పాటు వ్యాపారిని, లారీలో ఉన్న మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. దుంగలు దాదాపు మూడు టన్నుల వరకు ఉన్నాయని, వాటి విలువ రూ.50 లక్షల వరకు ఉంటుందన్నారు.